'ఇది ఏలా?'

'కేవలం నీవుమాత్రం ప్రతిక్షణం చూస్తూవుంటావు.'

'ఏమీ, మారు వేషం వేసుకుంటావా ?'

'నీ ఆర్డరయితే'

'ఇంతకష్టమెందుకు?'

'కష్టంలోనే అమితానందంవున్నది.'

'ఈ రెండురోజుల్లో ఏమంతలాభం పొందగలుగుతావు?'

'సుధాసిక్తమైన ఈ రెండుదినాలే చాలా మూల్యవంతమైనవి ఈ అవశిష్టఆధారాన్నికూడ అపహరించకు.'

యువకుని నయనాలు అశ్రుపూరితమైనాయి బాలికకూడ ఏడ్వు ప్రారంభించింది. కొంచెంసేపు యిద్దరు మౌనంగా లోలోపల దుఃఖాన్ని దిగమ్రింగుకున్నారు తదుపరి బాలిక నెమ్మదిగా వెళ్లిపోయింది. యువకుడు అకంపిత శిలావిగ్రహంలాగ అక్కడే చూస్తూ నిలబడిపోయినాడు.

సంధ్యారాగం తొందరగా ప్రగాఢఅంధకారంలో లీనమైపోయింది.

౨

'ఇంత గాబరాపడుతుందుకు ? భయమేమిటి ? ఇంత చింతాస్నిగ్ధహృదయుడవు కావలసిన అగత్యమేముంది ?'

'నేడే నావివాహం. నేను నీవల్ల ఆశీర్వాదం పొందటానికి, నిన్నాశీర్వదించి పంపించటానికి వచ్చాను'

'నేడే!'

'అవును, నేడే, ఇప్పుడే. కొంచెంసేపటితర్వాత ఇక్కడనుంచి వెళ్లగానే అంతా నిశ్చయించుకునే నిన్ను కలుసుకోవటానికి వచ్చా. నేను నీకు మాట ఇచ్చివున్నాగనుక.'

'ఇంతతొందరగా ఎక్కడినుంచి సుయోగం వచ్చింది? ఈసమయంలో నాదగ్గర ఉపహారయోగ్యమైన వస్తువేమిలేదే'

'ఆశీర్వాదమివ్వు. ఇంకా – ఇంకొకమాట.''

'ఏంమాట ?'

'ఇక నన్ను మరచిపో ప్రయత్నించు నేను మరణించాననుకో'

'మళ్ళీ అదేమాట! ఏమాట నాహృదయాన్ని విదీర్ణంచేస్తుందో దాన్ని మాటమాటకు ఎందుకు అలా ఉచ్చరిస్తావు? ఏమీ నీవెరుగవా '

'మాట్లాడకు పరపురుషుణ్ణి స్మరించడం పాపం గాదూ?'

'చెప్పివేశాగా ఇదివరకే. ఈపాపంలోంచి బయట పడటం నావశంకాదు. కేవలం నీప్రతిబంధంవల్లనే ఆయనకు తెలియచేయక పాపంమీద పాపంచేశాను. నీమనస్సు ఇష్టపడితే, ఆయనకుకూడ చెపుతా. మనోభారాన్ని తగ్గించుకుంటా.'

'వద్దు - వద్దు ఈవిషయాన్ని పెదవులుదాటి బయటకుపోనీవద్దని నాప్రార్థన. ఇంతవరకు మూడోప్రాణికి తెలియనివిషయం ఈరోజున బయల్పడనీయవద్దు. నేడే మన అంతిమవీడ్కోలు! నిజంగా!! ఆకంపనం ఎందుకుకలిగింది? ఈ వెర్రిచూపులేమిటి ? ఓదైవమా! నిజంచెప్పు. నీమనస్సులో ఏమివుంది ?'

'ఏమీలేదు. నీవు పరస్త్రీవి ఇకనిన్ను మరచిపోతాను ఇక, ఇప్పుడు నువుకూడ నన్ను – పరపురుషుణ్ణి – విస్మరించు'

'విస్మరించనా ?'

'అవును, ఇదికూడ పూర్తిచేయి'

'ఇక, నువుకూడ మరచిపోతావా? నీవు ఇటువంటివాడవయినావా ? ఏమి! '

'నిస్సందేహంగా నేనిటువంటివాడనే. నీవు నన్ను సహ్యించుకున్నా అది తప్పుపనికాదు. అయ్యయ్యో! విలవిస్తున్నావా ?'

'ఇలా అనకు. అబ్బ నాప్రాణాలు ఇక నిలువ నేరవు '

'నేను నిన్ను మరిచాను ఇక నీవుకూడ నయనాలతో, హృదయంతో వేరుపరుచు శెలవియ్యి. నేను నీకు ఆశీర్వాదమిస్తాను. నీవు ఎక్కడున్నా నిశ్చింతతో సుఖంగావుండు. ఇకనువు నవు అశ్రుబిందువులుతుడిచి. నవ్వుతూ నేనెక్కడవున్నా, సుఖంగా వుండగలందులకు ఒక్కమాటు విశుద్ధహృదయంతో ఆశీర్వదించు.'

' ...'

'మౌనంగా ఎందుకు వూరుకున్నావు ?'

' ......'

'ఏడుస్తున్నావా ? ఎబ్బెబ్బే! వివాహసమయంలో కన్నీరుకారుస్తున్నావా ? ఏమి నా వివాహంవల్ల నీ ఆత్మకు సుఖంకలుగదా ?'

'మరి ఏడ్పెందుకు ?'

'నీవు నన్ను ఏడ్పించుతున్నావు. నేను నీకేమైన చెడుగుచేశానా ? ఈవిధంగా ఏడ్పించటానికి ?'

'దైవమా! ఇది వినదగ్గవార్తయేనా ? నీవు— అపరాధమేనా!'

'మరి దీనురాలిని ఎందుకు త్యజించుతావు ? నా యీజన్మయొక్క సర్వసుఖాలు సమసిపోయినవి. యీమిగిలిన అంశమాత్రపు హృదయజ్యోతినికూడ నశింపజేయ సమకట్టావా ? ప్రాతఃకాలంనుంచి రాత్రి వరకు, రాత్రినుంచి ప్రాతఃకాలంవరకు ఏప్రాతస్మృతి-రజ్జువు నాధారంచేసుకొని నేను జీవిస్తున్నానో, దాన్ని కూడ తెగగొట్టతలచితివా ?'

'... ...'

'పలుకవేమి ?'

' .......'

'ఇప్పుడిక ఏడుపేనా! ఇటువంటి పురుషుడివేనా ?'

'....... '

'అబ్బ ఇంతబిగ్గరగ విలపించకు. ఎవరైనా విని ఇటువస్తారు. అయ్యయ్యో, పాదాలు స్పర్శించుచున్నావా! లే. లేచికూర్చో '

'అయితే నావివాహం ఆగిపోయింది.'

'ఎందుచేత ?'

'నీ ఆశీర్వాదం పొందలేకపోయాగా '

'పొందకపోవడమేముంది. నేను ఆశీర్వదిస్తూన్నాగా.'

'ఆశీర్వదించు '

'నీవు ఎక్కడవున్నా సుఖంగావుండు.'

'నీవు ఎవరినివరించావో, ఆమెతో అనంతఆనందమనుభవించుమనికూడ ఆశీర్వదించు.'

'నీవెవరిని వరించావో, ఆమెతో అనంతఆనందమనుభవించు '

'ఈవిధంగాకాదు. నవ్వుతూ అను.'

' ....చూడు, ఇప్పుడు సంతోషం కలిగిందా?'

'అపార ఆనందాన్ని పొందినాను. అమరత్వాన్ని సిద్ధించుకున్నా. ఇకనే పోయివస్తా '

'మళ్లీ యెప్పుడు దర్శనమిస్తావు?'

'దీనితోసరి ఇక దర్శనాలులేవు.'

'ఏమిటీ!'

'ధైర్యం! ధైర్యం! ఇంత యధీరచిత్తవుకాబోకు! నేను మహామూర్ఖుణ్ణి ఇది అసంభవం మనం తప్పక కలుస్తాం కాని ఎప్పుడో ఏలాగో ఇది దైవానికి తెలుసు. ఈ అంతిమక్షణంలో-ఒక్కమాటు నీపమిట కొంగుతో ఈ నయనాలను పవిత్రంచేస్తావా?'

'ఇక నీవుకూడ ఈమధుర పాదధూళితో నాయీ శిరస్సును ధన్య మొనరించుకోనీయి.'

'నీవు చాల ఉదారచిత్తవు. ఈసమయంలో నీ కోర్కెలను నేనడ్డురాను '

Saraswata Niketanam,
VETAPALEM.

## లీలావిహారం

'మహాభాగ్యం! మహాభాగ్యం! నాయీ కొంగు బంగారమయమైంది. నాయీఅంచలం సౌభాగ్య ధారలతో సిక్తమైపోయింది. నేను జీవితాన్ని పొందాను నాభాగ్యాకాశం వివిధవిచిత్రచిత్రాలతో అనురంజితమైపోయింది నీవుఎక్కడవున్నా సుఖంగా, ఆనందంగా దినాలు వెళ్లబుచ్చు'

'నాజన్మం సఫలమయింది. దైవం నీకపరిమిత సుఖ సౌభాగ్యమిచ్చుగాక.'

3

'రాముడూ?'

'ఏమిటి బాబుగారూ?'

'నీ నెలజీతం ఎప్పుడు పూర్తిఅవుతుంది?'

'మొన్ననేగా తమరుజీతం ఇచ్చినారు?'

'సరే, ఇదుగో ఈ నెలదికూడ తీసుకో; నువు ఆదినం అత్తవారింటికి వెళ్లుతానన్నావుగాదూ '

'అయినా మిమ్మల్ని ఒంటరిగావదలి ఎట్లు వెళ్లగలుగుతాను. ఈ ప్రయాణంలో నేను లేకుండా తమకు ఎంత ఇబ్బంది కలుగుతుంది?'

'ఓరివెధవ, వెళ్లు, నేను నీకు శెలవుఇస్తూన్నా వెళ్లు ఈరోజునే వెళ్లు? ఇదుగో బహుమతిగా ఈ గడియారం తీసుకో అత్తవారింటికి పోయేసమయంలో తగిలించుకువెళ్లు కాని ఒక్కమాట జ్ఞాపకంవుంచుకో. ఇది రెండువందలరూపాయల విలువగల గడియారము సుమా ! పోగొట్టుకోకు.'

'బాబుగారూ! ఇంతవిలువగల '

'వాగకు! చెప్పేదివిను. ఈ సూటుకేసు తీసుకు వెళ్లి మా అమ్మగారికి ఇవ్వు. నేను చాలదూరం పోవాలి దీన్ని ఎక్కడ మోసుకుపోయేది?'

'బాబూ! నేనుకూడ వెంట... '

'వద్దు, ఇక బండిరావటానికి ఒక అరగంట ఆలస్యంవుంది నీవు ఇప్పుడే యింటికిపో.'

'ఇక తమరో?'

'పనిమీద వెళ్లడం చూడటంలా?'

'కొంచెం ఫలహారం . . '

'ఫలహారము తరువాత చూడవచ్చు. ఇంకా రాత్రి భోజనమే జీర్ణంకాలేదు మనయింటిదగ్గర పిండివిసరే ముసలమ్మను ఎరుగుదువుగా! ఇదుగో ఆమెకు ఈ రెండువందలరూపాయలు తీసుకువెళ్లి ఇవిగో మీ అబ్బాయి ఇచ్చినాడని చెప్పి అందచేయి '

'ఆమెకెందుకు?'

'నీవు అతన్ని ఎరుగవు అతనిక్కడ నౌకరీచేస్తున్నాడు. సరే ఇకనుపో అమ్మగారిని కలుసుకొని అత్తవారింటికి వెళ్లు.'

'బాబూ! తమ రెక్కడికి పోతారు? ఇదేంటి బాబూ! నేను తమనివదలి వెళ్లను—తమరు ఒంటరిగా వదలి ఎప్పుడూ వెళ్లను. మీకళ్లు యీవిధంగా ఎందుకు మారిపోతున్నై? యీవిధంగా ఎందుకు చూస్తున్నారు? ఆజేబులో పిస్తోలు ఇటుతెండి పెట్టెలో పెడతాను '

'దాన్ని వుండనివ్వు ఏమిటి మాటల్లోనే బండి పోగొట్టతలచావా యేమిటి?'

'నేను వెళ్లను బాబూ! తమరు ఇంటికిపదండి'

'రే కాళ్లువదలు, వెధవ, గవర్నమెంటు నౌకరీ విడచి ఇంటికి వెళ్లడం?'

'అయితే నేను వెంటవుంటాను '

'నువు యింటికిపో, మాట లక్ష్యంలేదు?'

'బాబూ!.........'

'తక్షణంవెళ్లు'

అమ్మగారికి !

'ఈ ఉత్తరంచేరేలోపు నేనీప్రపంచములో వుండను అమ్మా! నన్నుక్షమించు. నన్నాశీర్వదించు. నాపాపకథనీకేలా తెలిపేది? అమ్మా! నీవు లీలను మరచావా? ఆలీలయే నా రోమరోమంలో, ప్రతిరక్తనాళంలో కలిసి యేకమైపోయింది. అమ్మా! నా యాత్మ ఆమెలోలీనమై ఏకాకారం కానీయక

పోయింది. ఈశరీరబంధనంలోపడి గిలగిలకొట్టుకుంటూ సంవత్సరాలు గడిపాను. ప్రతినిముసంలో వృశ్చిక సహస్రపు కొండెపోటుబాధను అనుభవించాను అప్పటికి ఆశామృతం బలవంతంగా ప్రాణాలు నిలిపింది. అప్పుడు నీమంచిచెడ్డలు చేయువారు ఎవరులేక పోయారు. తమ్ముడు క్లాసులో చదువుకుంటూ ఉండేవాడు ఇప్పుడు బి. ఏ ప్యాసయినాడు. ఇప్పుడు ఏదోవిధంగా నీకు ఉపచారంచేయగలిగిన వ్యక్తిత్వం వచ్చింది.

నీవు బంధువులుఅంతా కలిసి ఎన్నోసార్లు నా వివాహంకొరకు గట్టి ప్రయత్నాలు సలిపారు. ఎన్నో చోట్ల సంబంధాలుకుదిర్చారు. కాని లీల–నాఅంతరాత్మలో లీనమైనలీల–ఎవరివంక చూడనిచ్చింది.–ఎవరినిగురించి ఆలోచించ అవకాశమిచ్చింది? ఆమె దర్శనం చేసుకున్నప్పుడే వస్తున్నా. ఒక్కక్షణం దాటితే ఆమెలో తల్లీనమైపోతా. చాలాసుఖం,చాలా ఆనందం సంప్రాప్తమవుతుంది. ఆఖరుకు నేడే నా వివాహం అయింది! నేడే—యదార్థంగా నేడే–రెండు పాత్రలలో నీళ్లు ఏకంగా కలిసిపోయినట్లు మేమిద్దరం ఒకటయిపోయాం. అమ్మా! అమ్మా!! మాకు అమితానందం కలుగుతుంది. అమ్మా! అనంతంవరకు మేమిద్దరము ఒకటి అయివుండేలాగ ఒక్కపర్యాయం ఆశీర్వదించు మాయా ప్రపంచం మమ్మల్ని వేరుచేయకుండులాగ ఒక్కసారి నీవాగమృతధారలు ప్రసరింపజేయి!!

తమ్ముడివివాహంచెయ్యి చెల్లని ప్రేమతోపెంచు. ఎల్లప్పుడు ప్రేమించు. చెల్లెకినన్ను జ్ఞాపకం చేయబోకు పొరపాటుగానైనా నేను అయిదువేలరూపాయిలనోట్లు నీకు ఇచ్చివచ్చినాను. అవి ఇతరులవని నీతో అబద్ధమాడాను. అవి మనవే ఉపయోగించుకో.

అమ్మా! ఓమధురప్రేమమూర్తి అమ్మా!! శెలవు. ఇంకమనం ఈసారి అనంతంలో కలుసుకుంటాం. కాని ఎప్పుడైన యీలోపున నన్నుచూడగోరితే లీల నీల నయనాల్లో, చూచిరా. లీల లాహోరులోవుంటుంది. ఆమె గృహం నీవు ఎరిగిందే.

ఇట్లు

కృష్ణ.

[అనువాదకులు: యలమంచిలి వెంకటేశ్వరావు "అరవింద" హిందీప్రచారక్.]




గొప్ప తోటలు

ఇండియా, బర్మా, సిలోను దేశములలో

పోచా వారి విత్తులవల్లనే

పెరుగుచున్నవి.

పుష్పములు కాయగూరలు

ఉచిత బొమ్మల కేటలాగు అడుగుడు.

మెస్సర్సు పి. పోచా అండు సన్సు, 8, నాపైరు రోడ్డు, పూనా

Correspondence in English